## మంత్రిని కలిసిన మున్సిపల్ కమిషనర్



రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎంఆర్. రాజశేఖర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రికి వివరించారు. హుస్నాబాద్ మున్సిపల్ పాలకవర్గం సమావేశానికి త్వరలోనే హాజరవుతానని మంత్రి తెలిపారని కమిషనర్ రాజశేఖర్ చెప్పారు.

**-హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 10**

## కూలీకి వెళ్లి వస్తూ..

- **ఆటో టాటాఎస్ ఢీ : ఇద్దరు మృతి, దవాఖానలో మరో ఇద్దరు.. గురువన్నపేటలో విషాదఛాయలు**

కొమురవెల్లి/జగదేవ్‌పూర్, డిసెంబర్ 10 : వాళ్లంత పొట్ట కూటి కోసం ఆటోలో కొన్ని రోజులుగా వేరే గ్రామానికి వెళ్లి కూలి పనికోసం వెళ్తున్నారు. ఆటో టాటాఎస్‌ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు దవాఖానలో చికిత్స పొందతూ మృతి చెందారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని గురువన్నపేటకు చెందిన 12 మంది కూలీలు ఆదివారం ఆటోలో జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లికి పత్తి ఏరేందుకు వెళ్లారు. పని ముగించుకొని మరో 10 నిమిషాల్లో ఇంటికి చేరుతామనే సమయంలో ఆటో డ్రైవర్ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో మునిగడప-వట్టిపల్లి మధ్యలో ఎదురుగా వస్తున్న టాటాఏస్‌ని ఢీ కొట్టాడు. ఆటోలో ప్రయాణిస్తున్న వైనాల శిరీష (17), పుట్ట జయమ్మ (58) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటో డ్రైవర్ తేలు మహేశ్‌తో పాటు బాలనర్సవ్వ, లచ్చమ్మ, జానాబాయి, దాసరం లక్ష్మి, మల్లవ్వ, కనకవ్వ, గుర్రాల లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ దవఖానకు తరలించగా చికిత్స పొందుతూ గుర్రాల లక్ష్మి, మల్లవ్వ మృతిచెందారు. తీవ్రగాయాలైన దాసరం లక్ష్మి, బొయిన కనకవ్వలను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. స్వల్ప గాయాలైన వైనాల మమత, గాదె కావ్య దవాఖానలో ప్రథమ చికిత్స తీసుకుని గ్రామానికి వచ్చారు. **విషాదఛాయలు :** కొమురవెల్లి మండలంలోని గురువన్నపేటకు చెందిన కూలీలు ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువన్నపేట సర్పంచ్ వైనాల నిర్మలా పరుశరాములకు ఫోన్ చేసి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మెరుగైన చికిత్స అందించాలన్నారు.

### మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని
## వినియోగించుకోవాలి

**హుస్నాబాద్ ఆర్డీవో బెన్‌షాలోమ్**



జెండాఊపి బస్సును ప్రారంభిస్తున్న ఆర్డీవో బెన్ షాలోమ్

హుస్నాబాద్, డిసెంబర్ 10: మహిళలందరూ ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకోవాలని ఆర్డీవో బెన్ షాలోమ్ కోరారు. ఆదివారం హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల్లో పనుల కోసం వెళ్లే మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, నాయకులు ఎండీ హసన్, చిత్తారి రవీందర్, వల్లపు రాజు, బస్టాండ్ కంట్రోలర్ తిరుమల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

**దుబ్బాకలో ..**

దుబ్బాక,డిసెంబర్10: ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, సిద్దిపేట ఆర్డీవో రమేశ్ సూచించారు. ఆదివారం దుబ్బాక బస్టాండులో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మెనేజర్ సుఖేందర్‌రెడ్డి, సిబ్బంది, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం దుబ్బాక వంద పడకల దవాఖానలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ హేమరాజ్, ఎంపీపీ పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, నాయకులు రొట్టె రాజమౌళి, ఎల్లారెడ్డి, దేవుని చంద్రయ్య, నరేశ్ పాల్గొన్నారు.



దుబ్బాక బస్టాండ్‌లో ప్రయాణ టికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, సిద్దిపేట ఆర్డీవో రమేశ్, తదితరులు

## నేడు 'మల్లన్న' హుండీ లెక్కింపు



మల్లికార్జున స్వామి

చేర్యాల, డిసెంబర్ 10 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారి ఆలయంలో నేడు (ఈ నెల 11న) హుండీలను లెక్కించనున్నట్లు ఆలయ ఈవో ఏ. బాలాజీ ఆదివారం తెలిపారు. ఈ నెల 7న నిర్వహించాల్సిన హుండీ లెక్కింపు ఉన్నతాధికారులు ఆదేశాలతో వాయిదా పడడంతో తిరిగి 11న నిర్వహిస్తున్నట్లు ఈవో వెల్లడించారు. స్వామి వారికి మొక్కుల రూపంలో చెల్లించుకున్న బియ్యం, పసుపును తూకం వేయనున్నట్లు పేర్కొన్నారు. హుండీ లెక్కింపునకు పాలక మండలి, పోలీస్, రెవెన్యూ అధికారులు, బ్యాంకు అధికారులతో పాటు ఆహ్వానం అందుకున్న ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు. ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఒగ్గు పూజారులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## దుర్గామాత విగ్రహానికి జలాభిషేకం



చేర్యాల పట్టణంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

చేర్యాల, డిసెంబర్ 10 : పట్టణంలో నూతనంగా నిర్మించిన కనక దుర్గా ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు శ్రీ దుర్గామాత దేవాలయ నిర్మాణ కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నది. దుర్గామాత ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలో అమ్మవారి విగ్రహాన్ని శోభాయాత్ర చేపట్టడంతో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి జలాభిషేకం చేశారు.

## సంక్షేమ పథకాలు కొనసాగించాలి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న దేవీ రవీందర్


కొండపాక(కుకునూరుపల్లి), 10 : బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పెట్టిన సంక్షేమ పథకాలు కొనసాగించాలని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ అన్నారు. ఆదివారం కుకునూరుపల్లి మండలంలోని లకుడారానికి చెందిన ఎండీ. దస్తగిరికి రూ. 22,500, నాగపురి యాదయ్యకు రూ.22,500ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్‌ను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## శుభాకాంక్షల వెల్లువ



అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో ఘనవిజయం సాధించిన కుతుల్బాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్‌ను ఆదివారం ఉమ్మడి మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**-కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 10**



దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని ములుగు మండల వైస్ ఎంపీపీ వీరన్నగారి దేవేందర్‌రెడ్డి ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**-ములుగు, డిసెంబర్ 10**

## నేడు కొమురవెల్లికి ఎమ్మెల్యే 'పల్లా' రాక

కొమురవెల్లి, డిసెంబర్ 10 : అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మొదటిసారి కొమురవెల్లి మండల కేంద్రానికి (నేడు) సోమవారం రానున్నారు. కొమురవెల్లిలో మల్లికార్జునస్వామిని దర్శనం చేసుకున్న తర్వాత కొమురవెల్లి మండల బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం కానున్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



చేర్యాల మండలంలోని తాడూరులో మాట్లాడుతున్న రామ్మోహన్

చేర్యాల, డిసెంబర్ 10 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రామ్మోహన్ కోరారు. చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడూరు గ్రామంలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ చిన్నచిన్న తగాదాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంకు వివరాలు, ఏటీఎం కార్డు వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు.అపరిచిత వ్యక్తులు వాట్సాస్, ఫోన్‌కు పంపించే మెసేజ్‌లు ఓపెన్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్ర ప్రమీలామహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండ.. ఆరోగ్యశ్రీ పథకం

**తహసీల్దార్ రవీందర్‌రెడ్డి**

హుస్నాబాద్, డిసెంబర్ 10: నిరుపేదల ఆరోగ్యానికి రాజీవ్ ఆరోగ్యశ్రీ భరోసాగా నిలుస్తున్నదని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లోని సర్కారు దవాఖానలో ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయం పెంపు కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభాకర్, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, పున్న లావణ్యసది, భూక్య సరోజన, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, దవాఖాన వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, సీహెచ్‌వో శబ్దప్రకాశ్, హెల్త్ సూపర్‌వైజర్ కనుకయ్య, ఆరోగ్యమిత్రలు రమేశ్, కోటి, నర్సింహులు, అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవీందర్‌రెడ్డి